ఈ -సైకిళ్లు పంపిణీ

మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

కడా పీడీ వికాస్ మరమ్మత్

ప్రజాశక్తి- కుప్పం రూరల్: కుప్పం పట్టణంలోని ఏపీఎస్ ఆర్టీసీ బస్టాండ్ కూడలిలో ఈ-సైకిల్‌తో మహిళా సాధికారత కార్యక్రమాన్ని కడా పీడి వికాస్ మరమ్మత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సిఈఎస్ఎల్ డెలిగేట్ రీతూ, ఏపీఎస్ ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం విచ్చేశారు. పీడీ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మహిళా సాధికారత సాధించడానికి ఎనలేని కృషి చేస్తున్నారని, సంక్షేమ పథకాలలో అధిక భాగం మహిళలకు అందేలా చేస్తున్నారని అన్నారు. ప్రతి మహిళ ఒక పారిశ్రామికవేత్తగా ఎదగాలన్న ఉద్దేశంతో అన్ని విధాల మహిళలకు సహాయ సహకారాలు అందిస్తున్నారని, అందులో భాగంగానే కుప్పం నియోజకవర్గ పరిధిలో చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటున్న మహిళలకు విద్యుత్ సైకిల్స్‌ను అందించడం జరిగిందన్నారు. ఈ-సైకిల్ ధరను సంస్థ రూ.45 వేలు కాగా రాష్ట్ర ప్రభుత్వం కేవలం రూ.9450లకే మహిళలకు అందిస్తున్నట్టు తెలిపారు. ఈ సైకిల్స్ నడపడం వల్ల పర్యావరణ కాలుష్యాన్ని నివారించడంతోపాటు డబ్బు ఆదా చేసుకునే అవకాశం ఉందన్నారు. మొదటి విడతగా 400 మందికి ఈ-సైకిల్స్ అందించడం జరుగుతుందని, ఇవి సత్ఫలితాన్ని ఇస్తే తదుపరి మహిళలందరికీ సైకిల్స్ అందేలా చూస్తామన్నారు. టిడిపి నాయకులు కన్నన్, రాజ్ కుమార్, విశ్వనాథ నాయుడు, బాబు నాయుడు, దామోదర్ నాయుడు, జాకీర్ అహ్మద్, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న కడా పీడీ

మామిడికి గడ్డు కాలమే..

- ఆందోళనలో రైతన్నలు
- ఆగిన పల్ప్ ఎగుమతులు
- ప్రభుత్వం ఆదుకోకుంటే కష్టమే..

ప్రపంచవ్యాప్తంగా చిత్తూరు మామిడికి ఓ ప్రత్యేక గుర్తింపు ఉంది. ఇక్కడ ఫ్యాక్టరీలో గుజ్జుగా తయారు చేసిన మామిడి పల్ప్‌కు గల్ఫ్ దేశాల్లో అత్యంత గిరాకీ. ఇది గల్ఫ్ యుద్ధాలకు ముందు ఉన్న పరిస్థితి. గల్ఫ్ దేశాల్లో యుద్ధాల ఫలితంగా గత సంవత్సరం మామిడి ఎగుమతులు పూర్తిగా నిలిచిపోయాయి. చిత్తూరు జిల్లాలోని మామిడి గుజ్జు పరిశ్రమల్లో గత ఏడాది తయారుచేసిన గుజ్జు నిల్వలు పేరుకుపోయాయి. ఈ ఏడాది మామిడి కొనుగోలు చేయాలా.. వద్దా.. అని మామిడి గుజ్జు పరిశ్రమల యజమానులు అయోమయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ప్రత్యామ్నాయ పరిస్థితులను కల్పించి జిల్లాలోని మామిడి గుజ్జు విక్రయాలకు అవకాశం కల్పించాలని మామిడి పరిశ్రమల సమాఖ్య కోరుతోంది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వంతో మామిడి గుజ్జు పరిశ్రమల సమాఖ్య నేతలు సంప్రదింపులు జరుపుతున్నారు.

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాలోని పుణ్యక్షేత్రాలు ప్రభుత్వ పాఠశాలు, అంగన్వాడీ కేంద్రాలోని పిల్లలకు మామిడి గుజ్జును అల్పాహారంగా ఇవ్వడం ద్వారా కల్తీ లేని చిత్తూరు మామిడి జ్యూస్ విద్యార్థుల ఆరోగ్యానికి ఎంతో దోహదపడుతుందని సమాఖ్య నాయకులు కోరుతున్నారు. చిత్తూరు జిల్లాలో 1.50 ఎకరాల్లో మామిడి తోటలు విస్తరించి ఉండగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 2.79 లక్షల ఎకరాల హెక్టార్లలో మామిడి సాగు జరుగుతోంది. జిల్లాలోని మామిడి తోటలు విస్తీర్ణాన్ని దృష్టిలో ఉంచుకొని 47 మామిడి జ్యూస్ ఫ్యాక్టరీలు నెలకొల్పారు. 2023లో జిల్లాలోని 47 మ్యాంగో జ్యూస్ ఫ్యాక్టరీలు ఎనిమిది లక్షల మెట్రిక్ టన్నుల మామిడిని కొనుగోలు చేసి వీటిని పల్ప్‌గా తయారు చేశాయి.

గత సంవత్సరం మామిడి పంట గణనీయంగా తగ్గి 30శాతం పంట మాత్రమే వచ్చింది. గత సంవత్సరం మామిడి సీజన్లో జిల్లాలో 2 లక్షల టన్నుల పల్ప్‌ను ఉత్పత్తి చేశారు. చిత్తూరు జిల్లాలో ఉత్పత్తి అయిన పల్ప్ ఎక్కువగా యూరప్ దేశాలకు ఎగుమతి అవుతోంది. అలాగే కొంత గల్ఫ్ దేశాలకు, సింగపూర్ కూడా ఎగుమతి అవుతోంది. జిల్లాలో తయారయ్యే మామిడి పల్ప్ మనదేశంలో వినియోగం చాలా తక్కువనే చెప్పాలి. ఇతర దేశాల ఎగుమతి పైనే చిత్తూరు జిల్లాలో తయారయ్యే మామిడి గుజ్జు అమ్ముకోవాల్సిన పరిస్థితి. ఈ క్రమంలో అమాస్ ఇజ్రాయిల్ యుద్ధం, రష్యా ఉక్రెయిన్ మధ్య సాగుతున్న యుద్ధం ఫలితంగా చిత్తూరు జిల్లా నుండి మ్యాంగో పల్ప్ ఎగుమతులు ఆగిపోయాయి.

గత రెండు సంవత్సరాలుగా చిత్తూరు జిల్లాలో తయారుచేసిన మామిడి గుజ్జు 2.85 లక్షల టన్నుల నిల్వలు ఎగుమతులకు నోచుకోకుండా పేరుకుపోయాయి. జిల్లాలో మల్టీ నేషనల్ కంపెనీస్ చెందిన కోకోకోలా, పెప్సీ ఇతర శీతల పానీయాలకు బదులు జిల్లాలో పండిన మామిడి పల్ప్‌ను సేవించడం ద్వారా ప్రజల ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగపడే అవకాశాలు ఉన్నాయని మామిడి పరిశ్రమల సమాఖ్య, మామిడి రైతులు భావిస్తున్నారు.

చిత్తూరు జిల్లా నుండి వెళ్లే పల్ప్ ఎక్కువగా ఏమాం పోర్టు ద్వారా ఎగుమతి అయ్యేది. ప్రస్తుతం నిల్వ ఉన్న మామిడి పల్ప్‌కు ఎగుమతి ఆర్డర్లు వచ్చినా ఎగుమతి చేయడానికి తగినన్ని కంటైనర్లు అందుబాటులో లేవు. మన దేశం నుంచి గల్ఫ్ యూరప్ దేశాలకు వెళ్లేందుకు కంటైనర్ల కొరత ఉన్నట్లు మామిడి గుజ్జు పరిశ్రమల సమాఖ్య నాయకులు వాపోతున్నారు. ప్రస్తుతం జ్యూస్ ఫ్యాక్టరీలో ఉన్న మామిడి పల్ప్ ఖాళీ అయితే తప్ప రానున్న సీజన్లో జ్యూస్ ఫ్యాక్టరీలు తిరిగి మామిడి గుజ్జు ప్రాసెస్‌ను ప్రారంభించే అవకాశాలు తక్కువ అంటున్నారు. ఇటు మామిడి రైతులను అటు ఫ్యాక్టరీ యజమానులను ఆదుకునేలా ప్రభుత్వం రాయతీలను అందించాలని కోరుతున్నారు. గత ఏడాది బ్యాంకుల నుండి తీసుకున్న అప్పులు పెరుకుపోవడంతో బ్యాంకులు నోటీసులు జారీ చేస్తున్నారు. ప్రభుత్వం దీర్ఘ దృష్టితో ఆలోచించి మామిడి రైతులను, గుజ్జు పరిశ్రమల యజమానులను ఆదుకునేలా బ్యాంకుల నుండి తీసుకున్న అప్పులు వడ్డీల చెల్లింపుకు సమయం ఇవ్వడంతో పాటు, ఫ్యాక్టరీల్లో నిల్వ ఉన్న మామిడి గుజ్జు జిల్లాలో అమ్మకాలకు ప్రోత్సాహం ఇవ్వాలని కోరుతున్నారు.



ఏటా నష్టాలే..

- రామయ్య గౌడ్, మామిడి రైతు, కురపల్లి ఐరాల మండలం

మామిడి పంటలో ఏటా నష్టాలు చూడాల్సి వస్తోంది. పంట బాగా చేతికొచ్చినప్పుడు ధరలు అంతంతమాత్రంగానే ఉంటున్నాయి. నాకు మూడు ఎకరాల మామిడి తోపు ఉంది. గతేడాది సాగు ఖర్చు రూ.30వేలు అయితే.. మామిడికాయల అమ్మగా రూ40,000లుమాత్రమే వచ్చింది. గతేడాది పంట దిగుబడి తక్కువ ఉన్న కాలంలోనే సాగు ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేదు. ఈ ఏడాది పంట దిగుబడి పెరిగిన అంతంత మాత్రమే. మామిడికి కనీస ధర నిర్ణయించి మామిడి రైతులను ఆదుకోవాలి.

ప్రభుత్వం చేయూతనివ్వాలి

- కట్టమంచి గోవర్ధన్ బాబి మామిడి పరిశ్రమల యజమానుల సమాఖ్య జాతీయ నాయకులు

గల్ఫ్ యుద్ధాల ప్రభావంతో చిత్తూరు జిల్లాలో జ్యూస్ ఫ్యాక్టరీలో నిల్వలు పేరుకుపోయాయి. ఇతర దేశాలకు ఎగుమతులు కావడం లేదు. ఈ విషయాన్ని మామిడి పరిశ్రమల సమాఖ్య రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకుపోవడం జరిగింది. జిల్లాలోనే మామిడి గుజ్జును అమ్ముకునేలా ప్రముఖ పుణ్యక్షేత్రాలకు వచ్చే భక్తులకు, ప్రభుత్వ విద్యాసంస్థల్లోని విద్యార్థులకు అందించాలని విజ్ఞప్తి చేశాం. ఈదిశగా ప్రభుత్వ ఆలోచించి ఆదుకుంటే మామిడి పరిశ్రమలకు, రైతులకు మేలు జరుగుతుంది.

తుది శ్వాస విడిచిన దొరస్వామి నాయుడు

ప్రజాశక్తి- కుప్పం రూరల్: కుప్పం పీఈఎస్ వైద్య కళాశాల వ్యవస్థాపక అధ్యక్షులు దొరస్వామి నాయుడు గురువారం తుది శ్వాస విడిచినట్టు వైద్య కళాశాల సిబ్బంది తెలిపారు. రాష్ట్రం చిట్టచివరున్న కుప్పం ప్రాంతంలో 2003వ సంవత్సరంలో డాక్టర్ దొరస్వామి నాయుడు పీఈఎస్ వైద్య కళాశాలను స్థాపించారు. ఆనాటి రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ కళాశాలను ప్రారంభించారు. ఆనాటి నుంచి అంచెలంచెలుగా ఎదిగిన వైద్య కళాశాల ఎంతోమంది విద్యార్థులను వైద్యులుగా తీర్చిదిద్దింది. అంతేకాక మరెంతో మంది కుప్పం ప్రాంత ప్రజలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధిని అందించిన వ్యక్తిగా పిఈఎస్ వైద్య కళాశాల వ్యవస్థాపకులు దొరస్వామి నాయుడు ప్రజల గుండెలలో నిలిచిపోయారు. అలాంటి మహనీయుడు తుది శ్వాస విడిచారన్న విషయం తెలుసుకున్న వైద్యకళాశాల, నర్సింగ్ కళాశాల విద్యార్థులు, వైద్యులు, సిబ్బందితోపాటు కుప్పం ప్రాంత ప్రజలు సంతాపాన్ని వ్యక్తం చేశారు.



దొరస్వామి నాయుడు (ఫైల్ ఫోటో)

దొరస్వామి నాయుడు మృతి పట్ల పలువురు దిగ్భ్రాంతి

చిత్తూరుఅర్బన్: పీఈఎస్ విద్యాసంస్థల అధినేత, పీఈఎస్ కుప్పం మెడికల్ కళాశాల వ్యవస్థాపకులు దొరస్వామి నాయుడు మృతి పట్ల చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, ఒరిగిపల్లి వద్ద గల పీఈఎస్ స్కూల్ ప్రిన్సిపాల్ కృష్ణ బాబు, ఉపాధ్యాయులు గురువారం ఒక ప్రకటనలో దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. దొరస్వామినాయుడు కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్ళాలి

డిఆర్‌డిఏ పీడీ శ్రీదేవి

ముగ్గుల పోటీలను ప్రారంభిస్తున్న డిఆర్‌డిఏ పీడీ

ప్రజాశక్తి- యాదమరి: మహిళలు ఆత్మధైర్యంతో ముందుకు వెళ్లాలని చిత్తూరు డిఆర్‌డిఏ పీడీ శ్రీదేవి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని గురువారం చిత్తూరు జిల్లా సమాఖ్య ఆవరణలో స్వయం సహాయక సంఘసభ్యులకు పలు రకాల క్రీడాపోటీలను నిర్వహించారు. ఈసందర్భంగా సంఘసభ్యులు వేసిన ముగ్గులు అందరిని ఆకట్టుకున్నాయి. పీడీ మాట్లాడుతూ ప్రతి ఇంటిలో ఒక మహిళ పారిశ్రామికవేత్తగా ఎదగాలనదే ప్రభుత్వ లక్ష్యమని, ఈ దిశగా స్వయం సహాయక సంఘ సభ్యులు ప్రభుత్వ పథకాలను అందిపుచ్చుకొని ఆర్థిక స్వాలంబన సాధించాలన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ప్రతి ఒక్క సభ్యురాలు పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు. డిపిఎం సుబ్బారెడ్డి, డిఆర్‌డిఏ సిబ్బంది, జిల్లా సమాఖ్య ప్రతినిధులు, స్వయం సహాయక సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ అరెస్టు

16 పోలీస్ స్టేషన్లలో 31 కేసులు నమోదు

నిందితుడ్ని అరెస్టు చూపుతున్న ఎస్ఐ రాజ్ కుమార్

ప్రజాశక్తి - కార్వేటినగరం: మోస్ట్ వాంటెడ్ క్రిమినల్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రాజ్ కుమార్ గురువారం వెల్లడించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ చిత్తూరు ఎస్పీ, నగరి డీఎస్పీ పర్యవేక్షణలో సీఐ హనుమంతప్ప ఆధ్వర్యంలో క్రిమినల్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. ఇతనిపై ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మర్డర్, దొంగతనాలు, గంజాయి వంటి కేసుల్లో 16 పోలీస్ స్టేషన్లలో 31 కేసులతో పాటు నాన్ బెయిలబుల్ వారెంట్ కూడా ఉన్నాయన్నారు. పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్న నగరి మండలం తెరణి బ్రిడ్జి గ్రామానికి చెందిన బి.సుబ్రమణ్యం కుమారుడు అవినాక్షయ్య (26) ఊతుకోట వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బంది రాజశేఖర్, లోకానందం, యువరాజ్‌తో కలసి దాడులు నిర్వహించి అతనిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేసి పుత్తూరు కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. అతని అరెస్టులో ప్రతిభ కనబరిచిన సిబ్బందిని ఎస్పీ మణికంఠ చందోలు అభినందించినట్లు తెలిపారు.

వీర సైనికుల సేవలు, త్యాగాలు అజరామరం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: వీర సైనికుల సేవలు, త్యాగాలు అజరామరం అని రాష్ట్ర సైనిక సంక్షేమశాఖ సంచాలకులు బ్రిగేడియర్ వివి.రెడ్డి అన్నారు. రెండు రోజుల జిల్లా పర్యటనలో భాగంగా జిల్లాలోని పలు గ్రామాల్లో వీరమరణం పొందిన సైనికుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేశారు. స్థానిక మురుకంబట్టుకు చెందిన వీర సైనికుడు చంద్రశేఖరరెడ్డి సతీమణి కుసుమ, స్థానిక ఓటి చెరువుకు చెందిన నవీన్ కుమార్ సతీమణి ఉమామహేశ్వరి, బంగారుపాళ్యం మండలం పామినివాండ్లకు చెందిన సురేష్ బాబు సతీమణి ఇందిరా సరిత నివాసాలకు వెళ్లి ఒక్కొక్కరికి లక్ష రూపాయలు చొప్పున ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ధైర్యంగా ఉండాలని, ముఖ్యంగా పిల్లల చదువుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని వారికి సూచించారు. అనంతరం చిత్తూరు నగరంలోని జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయానికి చేరుకొని మాజీ సైనికుల సమస్యలపై కార్యాలయ ఉద్యోగులు, సిబ్బందితో చర్చించి పలు సూచనలు, సలహాలను తెలియజేశారు. ప్రస్తుతం అద్దె భవనంలో కొనసాగుతున్న జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయానికి కొత్త భవనాన్ని నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50శాతం చొప్పున నిధులను మంజూరు చేస్తాయని వెల్లడించారు. అనంతరం మాజీ సైనికులతో సమావేశా ఏర్పాటు చేసి పది అంశాలపై చర్చించారు. రాష్ట్ర సైనిక సంక్షేమశాఖ ప్లేస్‌మెంట్ అధికారి బీవీ రెడ్డి, జిల్లా సైనిక సంక్షేమ అధికారి కె.రాఘవులు, మాజీ సైనికుల సంక్షేమ సంఘం నాయకులు పళని, సురేంద్ర బాబు, రాజన్ పాల్గొన్నారు.

అమరవీరుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందిస్తున్న వివి.రెడ్డి

‘ఓటేరు’ కబ్జాదారులపై కేసు నమోదు చేయాలి

చెరువు ఆక్రమణలను పరిశీలించిన సిపిఎం

చెరువు కబ్జాను పరిశీలిస్తున్న సిపిఎం బృందం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి రూరల్ పరిధిలో ఉండే ఓటేరు చెరువు ఆక్రమణకు గురవుతుందని, దాన్ని ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు డిమాండ్ చేశారు. ఓటేరు చెరువు ఆక్రమణలను సిపిఎం నాయకులు గురువారం పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి విషయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వందవాసి నాగరాజు మాట్లాడుతూ తిరుపతి రూరల్ మండలం అవిలాల గ్రామ రెవెన్యూ లెక్క దాఖలా సర్వే నంబర్ 370లో 6.76 ఎకరాలు, 376లో 12.40 ఎకరాలు, 377లో 17.18 ఎకరాలు మొత్తంగా 36.34 ఎకరాల భూమి ఉంది. రెవెన్యూ రికార్డుల ప్రకారం అదంతా చెరువు భూమి. తరతరాలుగా వందలాది ఎకరాల భూములకు సాగునీరు అందించిన ఓటేరు చెరువు ప్రస్తుతం పరుల చేతికి చేరి ప్లాట్లుగా మారుస్తున్నారు. దాదాపు రూ.1080 కోట్ల విలువైన 36 ఎకరాల చెరువు భూమిని భూ ఆక్రమణ దారులకు అడ్డగోలుగా దోచి పెట్టడానికి తహశీల్దార్ స్థాయి నుంచి ఉన్నత స్థాయి అధికారుల వరకు ఏకమయ్యారని విమర్శించారు. బ్రిటీష్ కాలం నుంచి రెవెన్యూ రికార్డుల్లో అది చెరువు అని ఉంటే, కొంతమంది అధికారులు చెరువు కాదని పట్టాలిచ్చేసి యథేచ్ఛగా ప్లాట్లు వేసి అమ్మేస్తున్నారని విమర్శించారు. గతంలో సిపిఎం ఈ అక్రమాలను వెలుగులోకి తెచ్చిందని గుర్తు చేశారు. గత కొంతకాలంగా చెరువును ఎర్రమట్టితో పూడ్చారని, కొంతమంది అధికారులు సస్పెన్షన్‌కు గురైనా ఏమాత్రం లెక్కచేయకుండా భూమిని చదును చేయిస్తున్నారన్నారు. తక్షణం చెరువును కాపాడాలని, కబ్జాదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఓటేరు చెరువును పరిశీలించిన వారిలో సిపిఎం నాయకులు జి.బాలసుబ్రమణ్యం, టి.సుబ్రమణ్యం, ఎస్.జయచంద్ర, కె.వేణుగోపాల్, పి.హేమలత, కె.సుమన్, ఎం.నరేంద్ర, పి.బుజ్జి, మునిరాజు, శేఖర్ పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సమీక్ష సమావేశం

ప్రజాశక్తి- శాంతిపురం: మండలంలో ఉన్న ఉపాధి హామీ సిబ్బంది పనితీరుపై గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఉపాధి హామీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ప్రధానపనులైన పంట సంజీవిని, ఇంకుడు గుంతలు, మామిడి మొక్కల పెంపకం పనుల్లో నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవడంలో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారని ఇకపై ఉపేక్షించేది లేదని సిబ్బందిని హెచ్చరించారు. మొక్కల పెంపకం పనులలో నెలవారీ సంరక్షణ చెల్లింపులను మొబైల్ అప్లికేషన్‌లో, కార్యాలయ రికార్డులలో నమోదు అయిన తర్వాతనే చెల్లింపులు చేయాలని తెలిపారు. 2024- 2025 ఆర్థిక సంవత్సరంలో పనికి వచ్చిన ప్రతి కుటుంబానికి 100రోజులు పనులు కల్పించాలని, పనుల్లో ఉపాధి హామీ చట్టం ప్రకారం యంత్రాలు ఉపయోగిస్తే సిబ్బందిని విధుల నుండి తొలగించడానికి పై అధికారులకు సిఫారసు చేస్తామని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఏపీఆర్ కుమార్ సిబ్బందిని హెచ్చరించారు.

ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలి

హెల్మెట్ల పంపిణీ చేస్తున్న జడ్జి భారతి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే ప్రతి ఒక్కరు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎంఎస్.భారతి పేర్కొన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం గుడిపాల మండలం ఆరుల్ పురం గ్రామంలో స్వచ్ఛంద నిర్వాహకులు డాక్టర్ జాషావాతో కలసి పేదలకు హెల్మెట్లను పంపిణీ చేశారు. అనంతరం హెల్మెట్ వాడకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ హెల్మెట్ ధరించకపోవడంతో ఎక్కువ మంది ప్రమాదాల్లో మరణిస్తున్నారన్నారు. రోడ్డు ప్రమాదాలలో 90శాతం ద్విచక్ర వాహనం నడిపే వారి వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని ద్విచక్ర వాహనంపై ప్రయాణించే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఎన్‌జివోలు ముందుకు వచ్చి 300 మందికి పేదలకు హెల్మెట్‌లు పంపిణీ చేయడం హర్షించదగ్గ విషయమని అభినందించారు.

రేపు జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 8వ తేదీ శనివారం జరుగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో కక్షదారులు పాల్గొని కేసులను రాజీ చేసుకోవాలని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎంఎస్.భారతి పేర్కొన్నారు. గురువారం స్థానిక జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యాలయంలో శనివారం జిల్లాలో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ నిర్వహణపై మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ గౌరవ కేంద్ర న్యాయసేవ అధికార సంస్థ, రాష్ట్ర న్యాయసేవ అధికార సంస్థ, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు చిత్తూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.బీమారావు ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టులలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించబడుతుందని తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 32 బెంచ్‌లు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. 1997 సంవత్సరం నుంచి జాతీయ లోక్ అదాలత్ ద్వారా కేసులను రాజీ చేయడం జరుగుతుందన్నారు. కోర్టులలో లక్షలో కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, ప్రతి మూడు నెలలకు ఒక్కసారి లోక్ అదాలత్ నిర్వహించడం ద్వారా సుమారు 10 నుండి 20 శాతం కేసులు పరిష్కరం అవుతున్నాయని తెలిపారు. రాజీ మార్గంలో కేసులు పరిష్కరించుకోవడం వల్ల కక్షదారులకు సమయంతో పాటుగా, ధనం అదా అవుతుందన్నారు. లోక్ అదాలత్‌లో ఇచ్చిన తీర్పు అంతిమ తీర్పుని దాని పై ఆపీల్ కూడా ఉండదన్నారు. ముందస్తు ఫ్రీ లోక్ అదాలత్‌లో క్రిమినల్, సివిల్ 300 కేసులను పరిష్కరం చేయడం జరిగిందన్నారు. కక్షదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఎక్కువ కేసులను రాజీ చేసుకోవాలని కక్షదారులకు సూచించారు. శనివారం నిర్వహించే లోక్ అదాలత్‌లో న్యాయమూర్తులు, న్యాయవాదులు, రెవెన్యూ, పోలీసు, బ్యాంకు అధికారులు, చిట్ ఫండ్ కంపెనీలు, బీమా సంస్థ ప్రతినిధులు, కక్షదారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మినిమం టైం స్కేల్ అమలు చేయాలి

ప్రజాశక్తి - తవణంపల్లి: గురువారం మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు భోజన విరామ సమయంలో తమ సమస్యల పరిష్కరించాలని కోరుతూ నిరసన తెలిపారు. సమ్మె కాలపు ఒప్పందాలు, మినిమం టైం స్కేల్ అమలు చేయాలని, ఉద్యోగుల రిటైర్‌మెంట్ వయసు 62 సంవత్సరాలు చేయాలని, గ్రాడ్యుటి అమలు చేయాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎం ఆర్ సి సిబ్బంది ధన శేఖర్, సుజనా కుమారి, సురేఖ, ఈఆర్‌పిలు దేవేంద్ర, దిలీపు, సిఆర్‌పిలు గోపి, రేఖ, ఉషా ధనంజయ్, చిట్టిబాబులు పాల్గొన్నారు.

తాగునీటి నాణ్యత పరిశీలన

ప్రజాశక్తి - శాంతిపురం: మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఏ పీ ఆర్ కుమార్ గురువారం మొరసనపల్లి గ్రామంలో పర్యటించి ప్రజలకు సరఫరా చేయబడుతున్న త్రాగునీటి నాణ్యత ప్రమాణాలు పరిశీలించారు. ఈ సందర్భంగా త్రాగునీటి నాణ్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు. పరిశుభ్రమైన నీటిని సరఫరా చేయాలని సచివాలయంలోని ఏ.ఎన్.యంలు, ఇంజినీరింగ్ సహాయకులు, పంచాయతి కార్యదర్శులకు తెలియజేసారు. శుక్రవారం మండలంలోని అన్ని గ్రామాలలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఏ ఆర్ స్వాతి, టిడిపి లీడర్లు సుగుణమ్మ, నారాయణ స్వామి, చెంగప్పస్వామి, ఉపాధ్యాయులు, ఏ ఎన్ యం, అంగన్వాడి సిబ్బంది మరియు ఫీల్డు అసిస్టెంట్ హరి తదితరులు పాల్గొన్నారు.

మొగిలిని పర్యాటక కేంద్రం చేయాలి

ప్రజాశక్తి - బంగారుపాళ్యం: పూతలపట్టు నియోజకవర్గం, బంగారుపాలెం మండలం, మొగిలి శ్రీ కామాక్షి సమేత మొగిలీశ్వర స్వామి ఆలయం దానికి అనుసంధానమైన దేవరకొండను అభివృద్ధి చేయాలని శాసనసభలో పూతలపట్టు నియోజకవర్గం శాసనసభ్యులు కలికిరి మురళీమోహన్ టూరిజం శాఖ మంత్రికి విన్నవించారు స్పందించిన మంత్రివర్యులు ఆలయాల అనుసంధానం చేపడుతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ మాట్లాడుతూ దేవరకొండలో ప్యారా చ్యూట్ ఏర్పాటుచేసి, యాత్రికులను ఆకర్షించే విధంగా దేవరకొండను తయారు చేస్తామన్నారు.

విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలి

వార్షికోత్సవ సమావేశంలో ప్రసంగిస్తున్న ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం

ప్రజాశక్తి -కుప్పం రూరల్ : నేటితరం విద్యార్థులు రేపటి తరం ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం ఆకాంక్షించారు. కుప్పం మండలం పైపాళ్యం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ డాక్టర్ వెంకటేష్, తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెక్కునత్తం మణి, నాయకులు సంతోష్, కనకరాజు, భరణి, గోవిందస్వామి, మాజీ సర్పంచ్ ఉమామహేశ్వరి, ఎంపిటీసీ ఆర్ముగం, పాఠశాల ఛైర్మన్ దామోదరం, స్థానిక టిడిపి నాయకులు, ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజారోహణం

ప్రజాశక్తి - సోమల:సోమల మండలం, ఆవుల పల్లెలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం ధ్వజారోహణం చేసి, స్వామి వారిని సూర్యప్రభ వాహనంపై ఊరేగించారు. ఉదయం ఆలయంలోని మూల విరాట్ కు ప్రత్యేక అలంకరణలు చేసి అనంతరం అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం చేశారు.

మహిళా దినోత్సవాన్ని జయప్రదం చేయండి

ప్రజాశక్తి - పలమనేరు: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జయప్రదం చేయాలని ఐద్వా జిల్లా కన్వీనర్ భువనేశ్వరి పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో ఐద్వా పట్టణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆమె మాట్లాడుతూ లింగ వివక్ష లేని సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. శనివారం జరిగే అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి పెద్ద ఎత్తున మహిళలు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా పట్టణ కార్యదర్శి, నాయకులు జయంతి, రత్నమ్మ, ధనమ్మ ఖైరునిషా, హరి, నందిని తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపినవారికి జరిమానా

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండలంలోని పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన వారిని పలమనేరు జే ఎఫ్ సి ఎం కోర్టు మెజిస్ట్రేట్ వారి వద్దకు హాజరుపరచగా డ్రంక్ అండ్ డ్రైవ్ నాలుగు కేసులు 40 వేల రూపాయలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన 8 కేసులు ఎనిమిది వేల రూపాయలు మొత్తం 48 వేల రూపాయలు జరిమానా విధించినట్లు బైరెడ్డిపల్లి ఎస్సై పరశు రాముడు గురువారం ఒక ప్రకటనలోతెలిపారు.

వీధి దీపాల ఏర్పాటు

ప్రజాశక్తి - సోమల: మండల కేంద్రమైన సోమల పంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాలలో నూతన వీధి దీపాల ఏర్పాటు చేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి జయశంకర్ తెలిపారు. అదేవిధంగా కందూరు పంచాయతీ పరిధిలోని గ్రామాలలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టి, మురుగునీటి కాలువలలో చెత్తాచెదారం తొలగించడం వ్యర్థాలను తీసివేయడం, పిచ్చి మొక్కలు తొలగించడం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య, భోజనం అందించండి

ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ: నాణ్యమైన భోజనం మెరుగైన విద్య అందించాలని మండల విద్యాశాఖ అధికారి ముని సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. కనమనంబేడు పాఠశాల, బుచ్చి నాయుడు కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గాజుల పెళ్లూరు ప్రాథమిక పాఠశాల, నిండికండ్రిగ పాఠశాల, నీర్పకోట పాఠశాలల్లో విద్యాశాఖ అధికారి గురువారం తనిఖీలు చేపట్టారు. పాఠశాల రికార్డులు, విద్యార్థులకు అందిస్తున్న భోజనం పరిశీలించారు.

ఫారం పాండ్స్ ఏర్పాటు చేయాలి

నెల ఆఖరులోపు ఫారం పాండ్స్ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - సోమల: మండలంలోని ప్రతి పంచాయతీ కనీసం 10 ఫారం ఫండ్స్, రైతులకు ఉపయోగపడే విధంగా నిర్మాణం చేయాలని ఈ నెల ఆఖరి లోపల పది ఫారం ఫండ్స్ పూర్తి చేయాలని మహాత్మ గాంధీ ఉపాధి హామీ కమిషనర్ ఆదేశించినట్లు సోమల ఏపీఓ దినకర్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ వృధా అవుతున్నటువంటి నీటిని భూగర్భంలోకి ఇంకే విధముగా ఇంకుడు గుంతల నిర్మాణం చేసుకోవాలని తెలియజేశారు. ఈ అవకాశాన్ని రైతులు, నీరు వృధా అవుతున్నటువంటి ఇంటి వారు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

గ్రామాల్లో ఉపాధి వేతన దారులను పనులు చేసుకొనుటకు ప్రోత్సహించాలని కనీస వేతనం 300 రూపాయలు వచ్చే విధంగా పనిచేయాలని, వేసవికాలం దృష్ట్యా గతంలో నూరు రోజుల పని దినాన్ని 150 రోజులకు పెంచారని ఈ అవకాశాన్ని వేతన దారులు సద్వినియోగం చేసుకునే విధంగా క్షేత్రస్థాయి సిబ్బంది వేతన దారులకు అవగాహన కల్పించి వారికి పనులు చూపించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి కొరత లేదు : ఎంపిడిఓ

తాగునీటి ట్యాంక్ వద్ద నీటిని పరిశీలిస్తున్న ఎంపీడీవో

ప్రజాశక్తి- కార్వేటినగరం: మండల పరిధిలోని డిఎం పురంలో తాగునీటి ట్యాంకు, కొళాయి వద్ద ఎంపీడీవో టీ.చంద్రమౌళి గురువారం పరిశీలించారు. తాగునీటి ట్యాంక్ పక్కనే చెరువు ఉండడంతో నీళ్లు సమృద్ధిగా ఉన్నాయన్నారు. అదేవిధంగా గ్రామస్తులు తాగునీటి సమస్య లేదని వివరించారు. అనంతరం కేఎంపురం పంచాయతీ పరిధిలోని గొల్లకండిగ గ్రామంలో ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులను మధ్యాహ్న భోజనం పథకం గురించి అడిగి తెలుసుకున్నారు. భోజనం బాగుందని చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శి ఎస్.గోపి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సి.హరీష్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కోఆర్డినేటర్ షణ్ముగం

ప్రజాశక్తి- తవణంపల్లి: మండలంలోని అరగొండ మేజర్ పంచాయతీలో స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా ఘనవ్యర్థాల నిర్వహణపై గురువారం ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తవణంపల్లి, యాదమరి, బంగారుపాళ్యం, యాదమరి, ఐరాల, పూతలపట్టు, చిత్తూరు, గుడిపాల, గంగాధర నెల్లూరు, మండలాల వారీగా ఈవో పీఆర్డిలకు పంచాయతీ కార్యదర్శులకు చెత్త నుండి సంపద ఎలా తయారు చేయాలి, గ్రామాల్లో పారిశుద్ధ్యం ఎలా మెరుగుపరచాలి, తడి చెత్త పొడి చెత్త సేకరణకి సంబంధించి షెడ్డు నిర్వహణ ఎలా చేయాలని అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ షణ్ముగం, జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్, ఎంపీడీవో రెడ్డిబాబు, అరగొండ పంచాయతీ కార్యదర్శి మురుగేష్, సర్పంచ్ మల్లుదొరై, ప్రశాంత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేను త్వరితగతిన చేపట్టాలి: ఆర్డీవో

ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: రీ సర్వేను త్వరితగతిన చేపట్టాలని పలమనేరు ఆర్డీవో భవాని అన్నారు. గురువారం మండలంలోని లద్దిగం పంచాయతీ గ్రామాల్లో చేపట్టిన భూముల రీ సర్వే కార్యక్రమాన్ని ఆర్డీవో భవాని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పంచాయతీలోని గ్రామాలలో 729 మంది ఖాతాదారులు ఉన్నారని వారిలో 65మంది చనిపోగా 165 నోషనల్ కింద పడ్డాయన్నారు. వాటిని ఆధారాలు అధికారుల దృష్టికి తీసుకువస్తే వారందరికీ పాస్ పుస్తకాలు ఇస్తామన్నారు. ప్రతి రైతు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు పుస్తకం, రేషన్ కార్డు ఆన్లైన్లో వచ్చే వన్ బి అడంగల్, రెండు కలర్ ఫోటోలు ఆయా సచివాలయాల్లో అందించి తమ వ్యక్తిగత సమాచారాన్ని నమోదు చేయించుకోవాలన్నారు అనంతరం రీ సర్వే ప్రక్రియను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. తహశీల్దార్ హనుమంతు, మండల సర్వేయర్ గుణశేఖర్, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

విద్యార్థులకు ఫైల్స్ అందిస్తున్న దాతలు

ప్రజాశక్తి- శాంతిపురం: మండల పరిధిలోని కెనుమాకులపల్లి ఉన్నత పాఠశాలలో గురువారం నలంద విద్యాసంస్థల యాజమాన్యం పిల్లల ఎంతగానో వారికి ఉపయోగపడే డాక్యుమెంట్ ఫైల్స్‌ని ప్రతి విద్యార్థికి అందజేయడం జరిగింది. అనంతరం మంచి మార్కులలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు మెమొంటోస్ అండ్ మెడల్స్ అందజేయడం జరిగింది. కళాశాల కరెస్పాండెంట్ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ మన పాఠశాలలో మొదటి మూడు ర్యాంకులు సాధించిన వారికి ఉచిత విద్యను అందజేస్తామని హామీ ఇస్తూ భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో చేపడుతామని పరీక్షల్లో విద్యార్థులకు మంచి ఉత్తీర్ణత సాధించాలన్నారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, నలంద కళాశాల అధ్యాపక బృందం సుబ్రహ్మణ్యం, గణేష్, హరిప్రసాద్, శివకుమార్ పాల్గొన్నారు.

నేడు మహిళలకు వైద్యశిబిరం

ఎస్‌బిఐ చీఫ్ మేనేజర్ సురేంద్రబాబు

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: మహిళా దినోత్సవం పురస్కరించుకొని మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎస్‌బిఐ చీఫ్ మేనేజర్ సురేంద్రబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 8 మహిళా దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం ఉదయం 10 గంటల నుండి బంగారుపాల్యం భారతీయ స్టేట్ బ్యాంక్ ఆవరణంలో భారతీయ స్టేట్ బ్యాంక్, రత్నం మెమరీ హాస్పిటల్ ఉమ్మడిగా మహిళలకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళలు ఈ వైద్యశిబిరంకు హాజరై పరీక్షలు చేసుకోవాలన్నారు.

గృహప్రవేశంలో టిడిపి రాష్ట్ర నాయకుడు రఘుచంద్ర గుప్త



చిరు కానుకను అందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - బైరెడ్డిపల్లి : బైరెడ్డిపల్లి మండలం, లక్కనపల్లికి చెందిన గోపాల్ శెట్టి కుమారుడు మురళి నూతనంగా నిర్మించిన గృహం గృహప్రవేశానికి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యానివాహక కార్యదర్శి పి రఘుచంద్రగుప్తా హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యకర్తకు చిరు కానుక అందజేసి అభినందనలు తెలియజేశారు.

ఏఎంసి మాజీ డైరెక్టర్ రాజారెడ్డికి పరామర్శ

ప్రజాశక్తి - బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి గ్రామ పంచాయితీ, చీలంపల్లి గ్రామస్తుడు ఏ.ఎం.స మాజీ డైరెక్టర్ రాజారెడ్డి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో స్వల్పంగా గాయపడ్డారు. వేలూరు సి ఎం.సి. హాస్పిటల్‌లో చికిత్స పొంది డిశ్చార్జ్ అయి ఇంటికి చేరుకొన్నారు. ఈ నేపథ్యంలో మాజీ ఎం.ఎల్.ఏ.వెంకటేగౌడు, రాష్ట్ర వైకాపా కార్యదర్శి మొగసాల కృష్ణమూర్తి రాజారెడ్డిని పరామర్శించి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచు,ఎం.పి టి.సి, ఏ.ఎం.సి.యువనాయకుడు శైలేష్ చక్రవర్తి, మాజీ చైర్మన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు. పలమనేరు నియోజకవర్గం సీనియర్ నాయకులు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భాష్యం వంశీ చౌదరి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - బంగారుపాళ్యం: మండలంలోని గుంతూరు పంచాయతీ గ్రామానికి చెందిన భాష్యం వంశీ చౌదరి పుట్టినరోజు వేడుకలు గురువారం మండలంలోని బోయకొండలో ఘనంగా జరిగినది ఈ సందర్భంగా మాజీ ఏఎంసీ ఛైర్మన్ జయచంద్ర నాయుడు మాట్లాడుతూ చిన్న వయసు నుండి ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా అవసరాలను తీరుస్తున్న వ్యక్తిని ఆయన ఎదుగుదలకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు అన్నారు అనంతరం కేక్ కట్ చేసి పంచిపెట్టారు ఈ కార్యక్రమంలో మాజీ సింగల్ విండో అధ్యక్షులు హేమచంద్ర నాయుడు సర్పంచి కోకా ప్రకాష్ నాయుడు ఉప సర్పంచ్ లోకనాథం నాయుడు పలువురు ఆయన అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్లు ఇన్‌కమ్‌ట్యాక్స్ రిటర్న్ సమర్పించాలి

ప్రజాశక్తి - పలమనేరు: చిత్తూరు జిల్లా పలమనేరు పెన్షనర్ల భవనంలో గురువారం ఉదయం 10:00 గంటలకు పెన్షనర్ల సంఘ సమావేశం పెన్షనర్ల జరిగింది. ప్రథమంగా, పెన్షనర్లకు ఉచితంగా భవనమునందు గదులు నిర్మించి అందించిన దాతలు అయిన కుసుమ మునస్వామి, కుమార్తె కీ.శే. ఉమారాణికి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం పెన్షనర్ల సంగం అధ్యక్షులు రత్నారెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వంనుంచి రావలసిన బకాయిలు, తాత్కాలిక భృతి చెల్లించాల్సిందిగా ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా, నిర్ణయించిన గడువు లోపల ఇన్‌కమ్ ట్యాక్స్ రిటర్న్ సమర్పించాల్సిందిగా సభ్యులను కోరారు. ఈ కార్యక్రమంలో ధర్మయ్య, రాజన్న , విజయ్ కుమార్ , సత్యనారాయణ ప్రసాద్ , సుబ్బన్న , నరసింహులు , ప్రభాకర్ మొదలైన వారు పాల్గొన్నారు.

విద్యార్థులు నైతిక విలువలు పెంపొందించుకోవాలి

విశ్వం పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్లు జయచంద్రారెడ్డి, చిట్టిబాబు

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్ : విద్యార్థులు చిన్నతనంలోనే నైతిక విలువలను పెంపొందించుకోవాలని, అలా చేస్తేనే జీవితంలో ఎదుగుదల సాధ్యమవుతుందని విశ్వం పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్లు జయచంద్రారెడ్డి, చిట్టిబాబులు వెల్లడించారు. ఈ మేరకు స్థానిక సాంబయ్య కండ్రిగలో ఏర్పాటు చేసిన విశ్వం పబ్లిక్ స్కూల్ 18 వ వార్షికోత్సవాన్ని గురువారం మధ్యాహ్నం స్థానిక నాగయ కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్లు మాట్లాడుతూ క్రమశిక్షణతో విద్యను అభ్యసించి విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు ముఖ్యంగా తల్లిదండ్రులను, గౌరవించడంతోపాటు నైతిక విలువలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అదే క్రమంలో చదువుల విషయంలో అశ్రద్ధ చేయరాదని సూచించారు. 19 సంవత్సరాల క్రితం 200 మంది విద్యార్థులుతో ప్రారంభమైన తమ పాఠశాలలో నేడు 900 మందితో విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తమ పాఠశాలలోని అంకితభావం కలిగిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల నమ్మకం, విద్యార్థుల కృషితో ప్రతి ఏటా పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు సాధిస్తున్నట్లు వివరించారు. ఈ కారణంగానే తమ పాఠశాలకు మంచి పేరు ప్రఖ్యాతలు వచ్చాయన్నారు. సువిశాల స్థలంలో, ప్రశాంత వాతావరణంలో నిర్మించిన తమ పాఠశాలలో విద్యకే కాకుండా క్రీడలు, సైన్స్ ఫెయిర్లు నిర్వహణ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఎల్సిడి ప్రొజెక్టర్ల ద్వారా విద్యాబోధన చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఎప్పటిలాగే ఇకపై సైతం తమను విద్యార్థుల తల్లిదండ్రులు ఆదరించాలని వారు కోరారు. కాగా ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది తదితరులు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌పై తహశీల్దార్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి - పలమనేరు: చిత్తూరు జిల్లా, పలమనేరు మున్సిపాలిటీ పరిధి, బేరుపల్లి చెరువు సమీపంలో గల వ్యవసాయ భూమికి చెరువులో వెళ్లే దారికి అడ్డంగా ముళ్లకంచ వేస్తున్నటువంటి టీ ఒడ్డురు సర్పంచ్ మునుస్వామి, పై గురువారం సాయంత్రం పలమనేరు తహశీల్దార్‌కు రైతులు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకెళ్తే పలమనేరు ఆరు దొరస్వామి మొదలయార్ పేరు మీద సర్వే నంబర్ 239 ,241, 244 ల పైకి దాదాపు 5 ఎకరాల వ్యవసాయ పొలం ఉంది. మూడు తరాలుగా కలదని అప్పటినుంచి కూడా బేరుపల్లి చెరువు పక్క నుంచి వ్యవసాయ పొలం కు దారి ఉందని ఇంతవరకు ఎప్పుడు కానీ ఎవరు కానీ అభ్యంతరం చెప్పలేదని ఈమధ్య ఆ దారికి అడ్డంగా టీ వడ్డూరు సర్పంచి మునుస్వామి మళ్లకంచె వేస్తున్నాడని తెలుసుకొని ప్రశ్నించగా తమపై దౌర్జన్యం చేశాడని, దిక్కున్న చోట చెప్పుకోనని బెదిరించాడని బాధితులు మొదలయ్యారు కుమారులు మనవళ్లు జయ వేలు రఘుపతి కేశవ మొదలగు వారు పలమనేరు తాసిల్దార్‌కు ఫిర్యాదు చేశారు. సానుకూలంగా స్పందించిన తాసిల్దారు ప్రస్తుతానికి ముళ్లకంచెను తీయించి దారి సమస్య పరిష్కారం చేస్తానని తెలియజేశారన్నారు.

జగన్ అసత్య ప్రచారాలు జనం నమ్మరు

ప్రజాశక్తి - శాంతిపురం: అసెంబ్లీ సమావేశాలకు ఎగనామం పెట్టి తాడేపల్లి ప్యాలెస్‌లో కూర్చొని జగన్ 2 గంటలు ఎన్డీయే ప్రభుత్వంపై దుష్ప్రచార దాడి చేశారు. ఆయన ప్రసంగమంతా అర్ధ సత్యాలు, అసత్యాలే అని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు అన్నారు. 9 నెలల్లోనే ఎన్డీయే ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో 57 శాతం పూర్తిగా అమలు చేయడమైంది. మరో 52 హామీలు పాక్షికంగా అమలు చేశాం. ఇతరత్రా మంచి పనులు 500కు పైగా చేశారన్నారు. జగన్ ప్రభుత్వం 10 లక్షల కోట్లు అప్పు చేశారు. ఇందుకు సంబంధించి ఏడాదికి అసలు, వడ్డీలు రూ.66 వేల కోట్లు చెల్లించాలి. అలాగే 1.4 లక్షల కోట్లు బకాయిలు చెల్లించాలి. దివాలా తీసిన ఖజానాను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన అనుభవం, కఠోర శ్రమ, కేంద్ర ప్రభుత్వ తోడ్పాటుతో అగాధం నుండి ఒడ్డుకు చేర్చారు. జగన్ పాలనలో రైతు రుణమాఫీ, నిరుద్యోగభృతి, విదేశీ విద్య, చంద్రన్న బీమా, పండుగ కానుకలు లాంటి 120 చంద్రన్న సంక్షేమ పథకాలు రద్దు చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సబ్ ప్లాన్ నిధులు లక్ష కోట్లు దారి మళ్లించారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ ద్వారా లక్షలాది ఎకరాలు అసైన్ మెంట్ భూములు, ప్రయివేటు ఆస్తుల్ని జగన్ ముఠా కబ్జా చేసింది. ఉద్యోగులకు రివర్స్ పీఆర్సీ ఇచ్చారు. రూ.26 వేల కోట్లు బకాయిలు పెట్టారు. సాక్షి మీడియాకు ప్రభుత్వ నిధులు రూ.500 కోట్లు ఇచ్చారు. సర్వే రాళ్లపై జగన్ బొమ్మలకు రూ.700 కోట్లు దుర్వినియోగం చేశారు. ఇలా చెప్పుకుంటూ పోతే జగన్ రెడ్డి చేసిన అక్రమాలు అవినీతి కోకోళ్ళలు అని గౌనివారి శ్రీనివాసులు అన్నారు.

అంతర్జాతీయ సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరించిన టీటీడీ ఛైర్మన్

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ వృక్ష శాస్త్ర విభాగ ఆచార్యులు జె.కామాక్షమ్మ నిర్వహించే "సాంప్రదాయ ఔషధము.. ఆధునిక, సహజ ఆరోగ్య రక్షణ ఏకీకృత విధానం" అనే అంశంపై ఏప్రిల్ 9 నుంచి 11 వరకు మూడు రోజులపాటు జరిగే అంతర్జాతీయ సదస్సు కరపత్రాన్ని తిరుమలలో తితిదే ఛైర్మన్ అధికారిక భవనంలో ఛైర్మన్ బిఆర్ నాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంప్రదాయ ఔషధం ఆధునిక చికిత్స విధానంలో అనుసంధానం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వృక్షశాస్త్ర విభాగాధిపతి ఆచార్య నాగలక్ష్మి దేవమ్మ, చంద్ర పాల్గొన్నారు.

శ్రీ చైతన్య విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : తిరుపతి స్థానిక బైరాగి పట్టడలోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్ ఐపిఎల్ బ్రాంచ్‌లో ముగ్గురు విద్యార్థులు కరాటే పోటీల్లో నోబెల్ వరల్డ్ రికార్డ్ సాధించారు. ఒక్క నిమిషానికి 100 పంచ్ స్ట్రైక్ చేసిన నిత్యశ్రీ రెండవ తరగతి, రోహన్ ఆనంద్ ఏడవ తరగతి, దుర్గా యోజిత్ 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ ఘనత సాధించారు . ప్రిన్సిపల్ అన్నపూర్ణ ఏర్పాటు చేసిన అభినందన సభలో విద్యాసంస్థల ఏజీఎం సురేష్ విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ అన్నపూర్ణ, ఏవో రవి బాబు, ఆయా విభాగాల ఇన్చార్జిలు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

23 ఎర్రచందనం దుంగలు స్వాధీనం .. ముగ్గురు స్మగ్లర్ల అరెస్ట్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):జాతీయ రహదారిపై శేషాచలంలోని అత్యంత అరుదైన 23 ఎర్రచందనం దుంగలను అక్రమంగా తీసుకెళుతున్న ముగ్గురు స్మగ్లర్లను అరెస్టు చేసి, దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్ ఫోర్సు పోలీసులు తెలిపారు. టాస్క్ ఫోర్సు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆర్ ఐ సాయి గిరిధర్ కు చెందిన ఆర్ఎస్ఐ విష్ణువర్ధన్ కుమార్ బృందం బుధవారం రాత్రి నుండి శేషాచల అటవీ పరిధిలో అటవీ శాఖ అధికారులు ఎఫ్ఆర్వో మాల్యాద్రి, ఎఫ్బీఓ ఆదిశేషయ్యల సహకారంతో నెల్లూరు–గూడూరు జాతీయ రహదారి చవటపాళ్యం వద్దకు చేరుకుని వాహనాలు తనిఖీ చేపట్టారన్నారు. ఓ బొలేరో వాహనం ఆ మార్గంలో అనుమానాస్పదంగా కనిపించడంతో ఆపి తనిఖీ చేసే ప్రయత్నం చేయగా, అందులోని ముగ్గురు వ్యక్తులు పారిపోయే ప్రయత్నం చేశారన్నారు. వారిని వెంబడించి టాస్క్ ఫోర్సు సిబ్బంది అదుపులోకి తీసుకున్నారన్నారు. పట్టుబడిన వారిని చిత్తూరు జిల్లా వాసులుగా గుర్తించామన్నారు. వారిని దుంగలతో సహా తిరుపతి టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్‌కు తరలించి సీఐ సురేష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టాస్క్ ఫోర్స్ పోలీసులు తెలిపారు.

క్రైం న్యూస్

ద్విచక్ర వాహనం దగ్ధం

ప్రజాశక్తి - బంగారుపాళ్యం: ద్విచక్ర వాహనం ఆహుతి అయిన సంఘటన గురువారం మండలంలోని పాలేరు ఫ్లైఓవర్ వద్ద చోటు చేసుకుంది. పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు పలమనేరుకు చెందిన గీతా, రామ్మూర్తి ఇరువురు చిత్తూరుకి తమ ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా పాలేరు ఫ్లైఓవర్ వద్ద ద్విచక్ర వాహనం టైర్ పగిలి అదుపుతప్పి పడిపోవడంతో వాహనం రోడ్డుపైన పడి దొర్లింది. అపుడు రాసుకున్న నిప్పురవ్వలతో వాహనం మొత్తం తగలబడి కాలిపోయింది. ఇరువురు చిన్నపాటి గాయాలతో బయటపడినట్టు పోలీసులు తెలిపారు

ముందస్తు మహిళా దినోత్సవం

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : స్త్రీల పట్ల వివక్ష చూపుతున్న సమాజంలో మహిళల ప్రగతికి కృషిచేసిన సంఘసంస్కర్తలను గురించి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శాంతి విద్యార్థులకు వివరించారు. మండలంలోని 49 కొత్తపల్లిమిట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్‌లో గురువారం ముందస్తు మహిళా దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఉపాధ్యాయులు పాఠశాలలో పనిచేస్తున్న స్కావెంజర్స్‌లను, మధ్యాహ్న భోజన నిర్వాహకులను, మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఉదయ్ కుమార్, ధనంజయలు, శ్రీనివాసులు, శివాల గోవర్ధన్‌రెడ్డి, డాక్టర్ బండి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

విదార్థులకు విద్యా సామగ్రి వితరణ

ప్రజాశక్తి - చిత్తూరు డెస్క్: మండలంలోని విజయ పురం ఉన్నత పాఠశాలలో శుక్రవారం విశ్రాంత ఉపాధ్యాయులు రామచంద్రరాజు, చంద్రయ్య 48 మంది పదవ తరగతి విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు, జామెంట్రీ బాక్సులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్యామల చేతులు మీదుగా వితరణగా అందించారు. అనంతరం పదవ తరగతి పబ్లిక్ రాయు విద్యా ర్థులకు సూచనలు ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు తమవంతు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు

ప్రజాశక్తి - సోమల : బాల కార్మికులను పనిలో పెట్టుకుని వారి చేత పనులు చేయిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని లేబర్ ఆఫీసర్ ఆనందబాబు హెచ్చరించారు. మండల కేంద్రమైన సోమలలో పలు దుకాణాలలో ఆయన తనిఖీలు నిర్వహించి బాల కార్మికులు ఎవరైనా ఉన్నారా అని ఆరా తీశారు.అలా బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే చట్టపరంగా ఏ విధమైన చర్యలు తీసుకుంటామో దుకాణ యజమానులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అస్లాం, శోభారాణి, శారద, రేష్మ, దినేష్ పాల్గొన్నారు.

ఎంపిని కలిసిన కృపాలక్ష్మి

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు నియోజకవర్గ వైసీపీ ఇంచార్జ్ కృపాలక్ష్మి విజయవాడలోని గురువారం రాజంపేట ఎంపీ మిధున్‌రెడ్డిని ఆయన గృహంలో మర్యాదపూర్వ కంగా శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందించారు.

నేడు లేగ దూడల ప్రదర్శన

ప్రజాశక్తి- వెదురుకుప్పం : రాష్ట్రీయ గోకుల్ మిషన్ పథకం కింద పశు సంవర్ధక శాఖ తరుపున ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు పచ్చికాపల్లం పశు వైద్య అధికారి రాజేష్ తెలిపారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈనెల 7వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటలకు దేవళంపేట పంచాయతీ, తెల్లగుండ్లపల్లి గ్రామంలో లేగ దూడల ప్రదర్శన కార్యక్రమం నిర్వహిస్తారని, ఈ కార్యక్రమంలో పాడి రైతులకు ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్నట్లు ఆయన చెప్పారు.

వైసీపీ రాజేష్‌కు నివాళి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రూరల్ మండలంలోని గోపాల కృష్ణాపురం గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు సురేష్ సోదరుడు రాజేష్ మృతి చెందిన విషయం తెలియడంతో మాజీ మంత్రి ఆర్కే రోజా సోదరుడు వై.కుమారస్వామి రెడ్డి, రాజేష్ భౌతిక కాయంవద్ద నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట రూరల్ మండలం కన్వీనర్ లోకనాథం, వైయస్సార్ సిపి ఎస్టి సెల్ ఇరువారం చిరంజీవి, దాసు, దేవేందర్ రెడ్డి, మండల కో ఆప్షన్ మెంబర్ రామ్ బత్తయ్య, మునిరాజు, శ్రీనివాసులు రెడ్డి, గోపి, దిలీప్, సెక్రటరీ చిరంజీవి, షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE ADDL. SENIOR CIVIL JUDGE OF CHITTOOR
A.S. No. 72 of 2024

Between:
K.Kamavardhan ....Petitioner/Appellant
And:
K.Sudhakar and others ...Respondents/Respondents

NOTICE TO THE RESPONDENT NO. 7:-

To:
R-7. SMT P. DEVAYANI,
W/o Late K.Palani, aged 69 years, Hindu, House wife, R/at D. No. 16-383, Swamy Maistry Street @ Hakim Saheb Street, Chittoor Town & District.

Sir/Madam, Please take notice that the above named Petitioner/ Appeallant have filed the above Appeal. The above Appeal **No. 72/ 2024** is posted to **10-04-2025** for your appearance. Please be present on the said date at about **10-30 A.M.** before the said court either in person or through an advocate and to file your objections if any, failing which the matter will be decided in your absence as exparte.

Sd/- D.REDDEPPA REDDY
Advocate for Petitioner/Appellant
Place: Chittoor. Date: 03-03-2025.